క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



చిన్నచింతకుంట: మండల కేంద్రంలో గత నెల 30న రెవెన్యూ, గృహ నిర్మాణం, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన, భూ భారతి రైతు అవగాహన సదస్సును విజయవంతం చేసినందుకు తహసీల్దార్ ఎల్లయ్యను కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం కలెక్టరేట్‌లో శాలువాతో సత్కరించి మెమొంటో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దేవరకద్ర: స్థానిక తహసీల్దార్ కృష్ణయ్యను కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం కలెక్టరేట్‌లో శాలువాతో సత్కరించారు. ఇటీవల దేవరకద్రలో జరిగిన భూ భారతి చట్టం అవగాహన సదస్సును విజయవంతం చేసినందుకు అభినందించి సత్కరించారు.

విద్యార్థులకు సన్మానం



అడ్డాకుల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన హరికృష్ణ, నహీం, స్నేహితలను ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందించారు. ఉన్నత చదువులు చదివి గ్రామం, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు జంగం భూషణ్, తిరుపతయ్యగౌడ్, సందుల ఆంజనేయులు, సీజీ మధుసూదన్, వెంకటాంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో వేముల గ్రామ విద్యార్థి శైలజ మండల టాపర్‌గా నిలిచారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం విద్యార్థిని ఇంటికి వెళ్లి సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మండల టాపర్‌గా నిలవడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య, గౌస్, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, సత్యం, బంగారు, రఘుపతిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణాలకు భూమి పూజ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలోని పాలమూరు యూనివర్సిటీ, మన్యంకొండ బస్టాండ్ సమీపంలో శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి భూమి పూజ చేయనున్నట్లు రూరల్ ఏడీ మద్దిలేటి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎస్‌ఈ వెంకట రమేష్ కూడా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

మీ-సేవ కేంద్రాల్లోనే స్లాట్ బుకింగ్

దేవరకద్ర: రైతులు తమ భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మీ-సేవ కేంద్రాల్లోనే స్లాట్ బుకింగ్ చేసుకొని తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి మోసపోవద్దని.. వారు తయారు చేసిన డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయమని చెప్పారు.

రేపు మెగా వైద్య శిబిరం

దేవరకద్ర: ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉండటంతో పాటు వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందజేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కొత్తపల్లి వాసికి డాక్టరేట్

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లికి చెందిన శ్రీధర్ నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో రసాయన శాస్త్రం విభాగంలో చేసిన పరిశోధనలకుగాను శుక్రవారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీధర్ ప్రొఫెసర్ ప్రశాంతి పర్యవేక్షణలో 'కిలాలసిస్ అండ్ బయోలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ మెటల్ ఆక్సైడ్ నానో పార్టికల్స్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారన్నారు. ఆయన వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ప్రొ. అల్వాల రవీందర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీధరకు అభినందనలు తెలిపారు.



రివిజన్‌కు నోచుకోని భువన్



జడ్చర్ల పుర కార్యాలయం

- పేర్ల మార్పునకు అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు
- క్రయ విక్రయాలకు దక్కని అవకాశం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కె.రవి. జడ్చర్లలోని 26వ వార్డు వేంకటేశ్వరకాలనీలో నివాసం ఉంటున్నాడు. తాత ఎల్లప్ప చనిపోవటంతో ఆయన పేరున ఉన్న ఇల్లు 2012లో గ్రామపంచాయతీ రికార్డుల్లో తల్లి జంగమ్మ పేరున మార్చారు. కొంతకాలం కిందట తల్లి మృతిచెందడంతో ఆ స్థానంలో తన పేరు చేర్చాలని దరఖాస్తు చేసుకున్నారు. ఏటా పన్ను సక్రమంగా చెల్లిస్తూ పేరుమార్పిడికి అవసరమైన అన్ని పత్రాలు సమర్పించారు. అయినప్పటికీ పేరు మార్చకుండా ఉన్నారు. కారణాలు మాత్రం వెల్లడించడం లేదు. ఇలాంటి సమస్యనే చాలామంది ఎదుర్కొంటున్నారు.

జడ్చర్ల టౌన్: భువన్ యాప్ రివిజన్‌కు నోచుకోకపోవడం, జియోట్యాగింగ్ చేపట్టకపోవడంతో స్థానిక పురపాలిక ఆస్తి పన్ను గణనీయంగా పడిపోయింది. జడ్చర్ల, కావేరమ్మపేట ఈ-పంచాయతీకి నోచుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంటి యజమాని పేరు మారకపోవడంతో క్రయ విక్రయాలకు అవకాశం లేకుండాపోయింది. ఈ విషయమై వార్డు కౌన్సిలర్లు స్వయంగా పుర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల, బాదేపల్లి పక్కపక్కనే ఉన్నప్పటికీ గతంలో రెండు మేజర్ గ్రామపంచాయతీలుగా కొనసాగాయి. కాలక్రమేణా బాదేపల్లి నగరపంచాయతీగా.. ఆ తర్వాత రెండు పట్టణాలు కలిపి మున్సిపాలిటీగా మారాయి. ఈ క్రమంలో బాదేపల్లిలోని ఇళ్లన్నీ భువన్ యాప్‌లో నమోదు చేశారు. దీంతో ప్రతి ఇంటికి సంబంధించిన కొలతల ప్రకారం పన్ను విధించే అవకాశం ఏర్పడింది. కానీ జడ్చర్లలో మాత్రం కొలతల ప్రకారం ఇళ్ల వివరాలు నమోదు కాలేదు. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో ఈ-పంచాయతీ అమలులోకి వచ్చినా ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోయారు. మరోవైపు బూరెడ్డిపల్లి, నాగసాల శివారు గ్రామాలు పురపాలికలో విలీనమైన సమయంలోనే భువన్ యాప్‌లో వివరాలు నమోదులు చేశారు. దీంతో బాదేపల్లి, బూరెడ్డిపల్లి, నాగసాలలో ఆన్‌లైన్‌లో అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించడంతో పేరు మార్పిడి, ఇతర వ్యవహారాలన్నీ సవ్యంగా జరుగుతున్నాయి.

అధికారులకు ఫిర్యాదులు..

జడ్చర్ల, కావేరమ్మపేటకు చెందిన వార్డు కౌన్సిలర్లు ఆలూరి శశికిరణ్, బుక్క మహేష్ 4 నెలల కిందటి నుంచి రెండు పర్యాయాలు సీఎండీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గత నెలలో నక్ష కార్యక్రమం ప్రారంభం రోజున కలెక్టర్‌కు సైతం సమస్యను వివరించారు. అయినప్పటికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. కొలతల ప్రకారం ఆస్తిపన్ను లెక్కించడంతో పాటు పేర్ల మార్పిడికి అవకాశం కల్పిస్తే జడ్చర్ల, కావేరమ్మపేట నుంచి సైతం ఆదాయం పెద్దఎత్తున సమకూరే అవకాశం ఉంది. గ్రామపంచాయతీ రికార్డులు మున్సిపాలిటీలోకి కలిపేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

జడ్చర్ల, కావేరమ్మపేటలో ఇబ్బందులు..

జడ్చర్ల, కావేరమ్మపేటలోని 8, 9, 25 వార్డుల్లో సమస్యలు నెలకొన్నాయి. మిగిలిన వార్డుల్లో ఇళ్ల పట్టాలు, డాక్యుమెంట్లు ఉండటంతో భువన యాప్‌లో నమోదుగాకపోయినప్పటికీ పేర్ల మార్పిడికి అవకాశాలు కలుగుతున్నాయి. కొలతల ప్రకారం ఇళ్ల వివరాలు నమోదుగాకపోవటంతో పేరు మార్పిడికి నోచుకోవడం లేదు. దీంతో ఇంటి యజమాని మృతిచెంది ఏళ్లు గడుస్తున్నా పేరు మార్పిడి కావడం లేదు.

ఆదాయమంతా బాదేపల్లిదే..

భువన్ యాప్ రివిజన్‌గాకపోవడంతో ఆస్తి పన్ను భారమంతా బాదేపల్లిపైనే పడింది. బాదేపల్లిలో 10,416 ఇళ్లు ఉండగా.. రూ.4,51,46,469 ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. అందులో 90 శాతం వరకు వసూలవుతుంటాయి. అదే జడ్చర్ల, కావేరమ్మపేటలో 7,468 ఇళ్లు ఉండగా కేవలం రూ.1,53,00,580 మాత్రమే డిమాండ్ ఉండగా.. సుమారు 60 శాతం మాత్రమే వసూలవుతుంటాయి. ఆస్తిపన్ను బాదేపల్లిలో వసూలు చేసి జడ్చర్ల, కావేరమ్మపేటకు నిధులు కేటాయించాల్సి రావటం బాదేపల్లివాసులకు మింగుడు పడటం లేదు. తమ మున్సిపాలిటీని వేరు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.

> **అన్నీ ఉన్నా.. పేర్లు మార్చడం లేదు..**
>
> ఇంటి యజమాని చనిపోతే వారి కుటుంబ సభ్యులు పేర్లు మార్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లు ఉన్నా విక్రయించడానికి, కుదువ పెట్టడానికి అవకాశం లేకుండా పోయింది. సీడీఎంఏ కార్యాలయంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. రికార్డుల్లో అవసరమైన వారి పేరు మార్పునకు చర్యలు తీసుకోవాలి. అలాగే రివిజన్ చేసి కొలతల ప్రకారం పన్ను విధిస్తే ఆదాయం పెరుగుతుంది.
>
> – ఆలూరి శశికిరణ్, 26వ వార్డు కౌన్సిలర్
>
> **ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..**
>
> భువన్ యాప్ రివిజన్‌గాకపోవడంతో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. పేరు మార్పిడి చేయలేకపోతున్నాం. ఈ విషయంలో ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాల కోసం వేచి ఉన్నాం. పాలకవర్గంతోనూ చర్చించి ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం. ఇటీవల నక్ష ద్వారా కొలతలు వేయటం జరుగుతుంది. త్వరలోనే దీని ఆధారంగా పన్ను విధిస్తాం.
>
> – లక్ష్మారెడ్డి, పుర కమిషనర్, జడ్చర్ల

ఆదిశంకరాచార్యుల బోధనలు అనుసరించాలి

జడ్చర్ల: ఆదిశంకరాచార్యుల బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని జడ్చర్ల బ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నరేంద్రశర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అయ్యప్ప ఆలయంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, రుద్రాభిషేకం, అష్టోత్తర పూజ, మహా మంగళహారతి, మంత్ర పుష్పం ఆది శంకరాచార్యులకు పాదుకాభిషేకం తదితర కార్యక్రమాలు చేశారు. భారత ఖండంలో ఉపన్యాసాలు, చర్చల ద్వారా తన తత్వాన్ని ప్రచారం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రశర్మ, సభ్యులు రంజిత్‌బాబు, నర్సింహరావు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పుర పరిధిలోని భాగ్యేశ్వర ఆలయంలో శుక్రవారం ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పంచామృత అభిషేకం, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భార్గవశర్మ మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు ఆదిశంకరాచార్యులు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి సభ్యులు నర్సింహరావు, భీంసేనరావు, శిరీష్, ప్రవీణ్, రాజేష్, సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, మహిళా సభ్యులు ప్రసన్న, లక్ష్మి, జ్యోతి, మాధవి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా భక్తిగేయాలు, భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.



మన్యంకొండలో ఆది శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మన్యంకొండ ఆలయంలో..

మహబూబ్‌నగర్ రూరల్: ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పారాయణం చదివారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

భూత్పూర్: మండలంలోని కప్పెటలో శుక్రవారం బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠాపన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం గణపతి పూజ, పుణ్యాహ వాచనం, అఖండ దీపారాదన, యంత్రారాధన, ప్రధాన కలశస్థాపన చేశారు. శుక్రవారం ప్రాతః కాల పూజతో పాటు యంత్రాభిషేకం, దీక్ష హోమాలు, నాభిశిల ఊరేగింపు చేపట్టారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బొడ్రాయికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అకాల వర్షం

- విరిగిన స్తంభాలు.. తడిచిన వరి ధాన్యం

భూత్పూర్: పురపాలికతో పాటు మండలంలోని కొత్త మొల్గర, కప్పెట, రావులపల్లి, అన్నాసాగర్‌లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరుబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. కప్పెటలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



కప్పెటలో నెలకొరిగిన విద్యుత్ స్తంభం, చెట్టు

కోయిల్‌సాగర్‌లో వడగాళ్ల వర్షం..

దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో కుప్పగా పోసిన వరి ధాన్యం తడిసిపోయింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా రాత్రి 9 వరకు పునరుద్ధరించలేదు.

నేడు చలో బస్‌భవన్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్మికులపై రోజురోజుకు పెరుగుతున్న పనిభారంతో పాటు బకాయిల చెల్లింపు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలు తదితర సమస్యలు పరిష్కరించాలంటూ శనివారం చలో బస్‌భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు ఐఎన్‌టీయూసీ అనుబంధమైన స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రీజినల్ కార్యదర్శి విజయ్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు.. జిల్లాలోని ఆర్టీసీ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 17వ డివిజన్ పరిధిలోని పిల్లలమర్రి రోడ్‌లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం పుర కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని వినతి



నవాబుపేట: గాలీవానకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని.. వెంటనే పునరుద్ధరించాలని మండలంలోని దొడ్డిపల్లి, కూచూరు గ్రామస్తులు శుక్రవారం సంబంధిత మండల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువారం అర్ధరాత్రి ఈదురు గాలులతో పాటు కురిసిన వర్షానికి దొడ్డిపల్లిలోని 11 కేవీ విద్యుత్ తీగలు తెగి సరఫరా నిలిచిపోయిందని.. అలాగే కూచూర్, దొడ్డిపల్లిలో పొలాల వద్ద ఉన్న స్టార్టర్లు, తీగలు సైతం కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విద్యుత్ తీగలను సరిచేసి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. మొదట గ్రామానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని.. రెండ్రోజుల్లో రైతులకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని మండల విద్యుత్ అధికారి సంతోష్ వివరించారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి

భూత్పూర్: వరి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు సింగిల్‌విండో సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కొత్త మొల్గరలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు సరిపడా గన్నీ బ్యాగులు అందించడంతో పాటు అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జయలక్ష్మి, ఆర్‌ఐ వెంకటేశ్, సింగిల్‌విండో సిబ్బంది వెంకటేష్, రైతులు ఉన్నారు.



వరి ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

బస్ షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ

జడ్చర్ల టౌన్: పుర పరిధిలోని సిగ్నల్‌గడ్డ ఎంపీడీఓ కాంప్లెక్స్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణానికి శుక్రవారం లయన్స్‌క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ డా. రాంరెడ్డి, అధ్యక్షుడు కైలాస్ జవహర్ టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో లయన్స్ పాపిరెడ్డి, పెద్ది పెంటయ్య, కూన యాదయ్య, కాల్వ రాంరెడ్డి, బాద్మి ధ్రువ, కరకాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటేశ్ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న లయన్స్ సభ్యులు

విద్యుత్ తీగలు సరిచేయండి

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం గ్రామంలో రైతు మినిగే భాస్కర్ పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. సరి చేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం వరి పంట కోతకు వచ్చిందని.. పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో కోత కోసేందుకు కోత మిషన్‌లు రావడంలేదని రైతు ఆవేదన చెందుతున్నాడు. ఇప్పటికైన అధికారులు స్పందించి పొలంలో ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలని కోరారు.



కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు భాస్కర్

శిథిలావస్థలో పశు వైద్య కేంద్ర భవనం

అడ్డాకుల: మండలంలోని వేములలో గ్రామీణ పశు వైద్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరి గోడలు, పైకప్పు పెచ్చులూడిపడుతున్నాయి. వర్షాకాలంలో వర్షపు నీళ్లు లోనికి చేరుతుండటంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనం గోడల్లో ఉండే ఇనుప చువ్వలు బయటకు కనిపించేలా పెచ్చులు ఊడిపడ్డాయి. భవనం కిటికీ వద్ద గోడకు పగుళ్లు వచ్చాయి. ఈ భవనంలోనే మండల పశువైద్యాధికారి విధులు నిర్వర్తిస్తారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి దాని స్థానంలో కొత్తది నిర్మించాలని గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. ఇప్పటికైనా స్పందించి శిథిల భవనాన్ని తొలగించి దాని స్థానంలో కొత్తది నిర్మించాల్సిన అవసరం ఉంది.



వేములలోని గ్రామీణ పశు వైద్య కేంద్రం

మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు

భూత్పూర్: మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు తప్పవని భూత్పూర్ సీఐ రామకృష్ణ హెచ్చరించారు. గత నెల 30న అర్ధరాత్రి 1.30 సమయంలో ఎస్‌ఐ చంద్రశేఖర్‌తో పాటు సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో భూత్పూర్ చౌరస్తాలో నలుగురు బాలురు ఇద్దరు బాలికలతో కలిసి కారులో తిరుగుతుండగా గుర్తించి అదుపులోకి తీసుకొని తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు. శుక్రవారం పిల్లలతో పాటు తల్లిదండ్రులను భూత్పూర్ సర్కిల్ కార్యాలయానికి పిలిపించి సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ చంద్రశేఖర్ కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించాలని, వారికి బైక్‌లు, కార్లు ఇవ్వొద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్పీ ఆదేశానుసారం మైనర్లు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు సీఐ వివరించారు.

సీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే



దేవరకద్ర: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి కె.రామకృష్ణారావును శుక్రవారం హైదరాబాద్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తిరుమలలో పెద్ద ఆదిరాల భజన బృందం



జడ్చర్ల: తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శుక్రవారం మండలంలోని పెద్ద ఆదిరాలకు చెందిన భజన బృందం భజన కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో రమేశ్‌జీ, తిరుపతయ్య, రవీందర్, యశోద, నర్సమ్మ, పాండు, సత్తయ్య, యాదగిరి, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ కొనుగోలు చేయాలి

కృష్ణా: రైస్ మిల్లర్లు ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు రాస్తారోకో చేపట్టారు. మిల్లుల్లో దించుకోకుండగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై గుడెబల్లూర్ శివారులో గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మిల్లుల యజమానులు కేవలం 1010, దొడ్డురకం ధాన్యాన్ని మాత్రమే మొదట ప్రాధాన్యమిచ్చి తీసుకుంటున్నారన్నారు. నాలుగు రోజులుగా మిల్లు వద్ద వేచి చూస్తున్నా దొడ్డురకం ధాన్యాన్ని అప్పటికప్పుడే తీసుకుంటున్నారన్నారు. అదే విధంగా ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం పూర్తిగా ఎండటంతో ధాన్యంలో నూకలు వస్తున్నాయని చెబుతూ క్వింటాల్‌కు 2 నుంచి 3 కేజీల చొప్పున తరుగు తీస్తున్నారని వాపోతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎండీ నవీద్, తహసీల్దార్ వెంకటేష్ అక్కడి చేరుకొని రైతులతో చర్చించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న రైస్ మిల్లులో రైతుల తెచ్చిన ధాన్యాన్ని దింపిస్తానని ఎస్‌ఐ నవీద్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. రాస్తారోకో కారణంగా దాదాపు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది.



కన్మనూర్ మిల్లు వద్ద నిరసన చేస్తున్న రైతులు

ధాన్యం బస్తాలు దింపుకోవాలని నిరసన

మరికల్: మిల్లుకు తీసుకొచ్చిన ధాన్యం బస్తాలను దింపుకోవాలని రైతులు శుక్రవారం కన్మనూర్ మిల్లు వద్ద నిరసన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల పాటు నిద్రాహారాలు విడిచి ధాన్యం దించుకుంటారని ఆశతో ఎదురుచూస్తున్నట్లు వాపోయారు. అధికారులు వచ్చే వరకు ఇక్కడే ఉంటామని ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో మిల్లు యాజమాని సివిల్ సప్లయ్ జిల్లా డీఎం సైదుల దృష్టికి తీసుకెళ్లారు. మిల్లు యజమాని మాట్లాడుతూ.. 4 వేల ధాన్యం బస్తాలను మాత్రమే అన్‌లోడ్ చేసుకుంటామని, అధికారులు అనుమతి ఇస్తే మరో 25 వేల ధాన్యం బస్తాలకు అన్‌లోడ్ చేసుకునేందుకు వీలుందని పేర్కొన్నారు.

మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట ఎడ్యుకేషన్: భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నారాయణపేటలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యుడు గడ్డం తిప్పన్న సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో జాబ్‌మేళా కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెగా జాబ్‌మేళాలో సుమారుగా 50కి పైగా కంపెనీలు పాల్గొనున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు పోలీస్ పటేల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.